క్లుప్తంగా

తాగునీటి సమస్య రానీయొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీవో

లోకేశ్వరం: గ్రామాల్లో తాగు నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. సిబ్బంది అందుబాటులో వీధులను శుభ్రం చేయించాలన్నారు. బోరు బారువులు, త్రీఫేజ్, సింగిల్ మోటార్ల వివరాలను గ్రామాల వారీగా తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తిలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టే సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు గురువారం నాయకులు భూమిపూజ చేశారు. రూ.11.50లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శనిగారపు శ్రావణ్, కార్యదర్శి సురేందర్, లక్ష్మీరాజం, గంగరాజం, సాజిద్, శంకర్, తదితరులు ఉన్నారు.

సరుకులు పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన విబూది నవీన్ ఇటీవల ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వరల్డ్ విజన్ స్వచ్ఛంధ సంస్థ సభ్యులు గురువారం మృతుడి కుటుంబానికి రూ.మూడు వేల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు.

కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలి


రోడ్డు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమాకాంత్

పెంబి: మండలంలోని గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. నిర్మించిన తర్వాత మట్టితో కట్టలు పోసి సరిపడ నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, శంకర్, తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు సన్మానం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మల్టీ పర్పస్ వర్కర్లను ప్రత్యేకాధికారి, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. శానిటేషన్ డ్రైవ్‌లో మల్టీపర్పస్ వర్కర్లు చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. తాజా మాజీ సర్పంచ్ రాంరెడ్డి, రమేశ్, ఇంద్రకరణ్‌రెడ్డి, అజీమ్, సంతోష్, గంగారెడ్డి, గంగారాం, కార్యదర్శి వీణారెడ్డి పాల్గొన్నారు.

బాబా ఆలయంలో సందడి


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: రెండో షిర్డీగా పేరొందిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం బాబాకు మంగళస్నానం, అభిషేకం, అలంకరణ, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఆలయానికి పాదయాత్రగా వచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శ్రీహరిరావు జన్మదిన వేడుకలు


శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి జన్మదిన వేడుకలను ముందస్తుగా గురువారం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కుభీర్‌లో స్వల్ప ఉద్రిక్తత

కుభీర్: మండలకేంద్రంలో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య రాళ్ల దాడి జరగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కుభీర్‌లో ఓ వర్గం ర్యాలీ చేపట్టగా.. జాంగావ్‌రోడ్డులోని ఓ ప్రార్థన మందిరం వద్దకు రాగానే మరో వర్గంవారు రాళ్లతో దాడి చేశారంటూ ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. పరస్పరం రాళ్ల దాడి చేసుకున్నారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. ముందు జాగ్రత్తగా భైంసా నుంచి అదనపు బలగాలను రప్పించారు.

పంటలకు నీరందేనా.?

- పిచ్చిమొక్కలతో అధ్వానంగా స్వర్ణ ప్రాజెక్టు ఉపకాల్వలు
- చివరి భూములకు యాసంగి నీరు అందడం లేదంటున్న అన్నదాతలు
- ప్రస్తుతం నెలలో 20 రోజులు విడుదల చేస్తున్న అధికారులు
- నిరంతరం సరఫరా చేయాలని వినతి


ఉపకాల్వలో పేరుకుపోయిన పూడిక, పెరిగిన పిచ్చిమొక్కలు


స్వర్ణ ప్రాజెక్టు మధ్య కాలువ

సారంగాపూర్: మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు మధ్య కాల్వను నమ్ముకొని పంటలు పండిస్తున్న రైతులకు ఈసారి కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే దీని కింద ఉన్న ఉపకాల్వలు పిచ్చిమొక్కలు, మట్టితో అధ్వానంగా మారాయి.

దీంతో నీటి ప్రవాహం సరిగా జరగక.. చివరి భూములకు నీరు అందడం లేదు. మరోవైపు మధ్య కాల్వకు అధికారులు 10 రోజులు నీటిని విడుదల చేసి.. ఐదు రోజులు బంద్ చేస్తుండటంతో చివరి భూములకు సాగునీరందడం లేదు. ఈ కాల్వ పరిధిలో బోర్లు ఉన్న వారు ఇప్పటికే పంటలు సాగు చేస్తున్నారు. మరికొందరు మాత్రం సాగునీటిని విడుదల చేస్తారనే ఆశతో బోర్లున్న చోట వరినార్లు పోసుకున్నారు. ఈ భూములకు నీరందకుంటే సుమారు రెండు వేల ఎకరాలు బీళ్లుగా మారుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

స్వర్ణ ప్రాజెక్టుకు మూడు కాల్వలు..

స్వర్ణ ప్రాజెక్టులో పూర్తి నీటి సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.135 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తం 1183 అడుగుల కాగా.. ప్రస్తుతం 1177.6 అడుగుల మేర నీరుంది. స్వర్ణ ప్రాజెక్టుకు మూడు ప్రధాన కాల్వలు ఉండగా వీటి ఆయకట్టు పరిధి 10వేల ఎకరాలు.

మధ్యకాల్వ కింద 5,945 ఎకరాల్లో సాగు..

స్వర్ణ ప్రాజెక్టు మధ్య(ప్రధాన) కాల్వ కింద 5,945 ఎకరాల ఆయకట్టు ఉంది. మధ్య కాల్వ ద్వారా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ, కౌట్ల(బి), సారంగాపూర్, యాకర్‌పల్లి, జామ్, బోరిగాం, ఆలూరు, ధని, చించోలి(బి), నిర్మల్‌రూరల్ మండలం వెంగ్వపేట్ గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువ కింద మొత్తం 8 ఉపకాలువలు, 6 చిన్న చిన్న కాలువలు ఉన్నాయి. ప్రాజెక్టులో సరిపడ నీరున్నా.. అధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా నెలలో 20 రోజులు (10 రోజులు వదిలి ఐదు రోజులు బంద్) నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో చివరి భూములకు సాగు నీరందక పోవడంతో బీళ్లుగానే ఉన్నాయి.

అస్తవ్యస్తంగా ఉపకాల్వలు..

మధ్య కాలువలో పూడిక, పిచ్చిమొక్కలు తొలగించిన అధికారులు డిస్ట్రిబ్యూటరీ(ఉప కాలువ)లకు మరమ్మతులు చేయించకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. పిచ్చిమొక్కలు, మట్టితో నిండి నీటి ప్రవాహం ముందుకు వెళ్లడం లేదు. జనవరి 1న నీటిని విడుదల చేసినప్పటికీ చివరి భూములకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

నెలలో 20రోజులు విడుదల చేస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వర్ణ ప్రాజెక్టు మధ్య కాల్వకు 10రోజులు నీరు విడుదల చేసి.. ఐదు రోజులు బంద్ చేస్తున్నాం. ఈ విషయం తెలియక రైతులు సాగునీటిని బంద్ చేశారని అనుకుంటున్నారు. ఉపకాల్వల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించే విషయమై అధికారులకు నివేదిస్తాం.

– మధుపాల్, ఏఈ, స్వర్ణ ప్రాజెక్టు

నీరందడం లేదు



ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేశామని అధికారులు అంటున్నారు. కానీ మా భూములకు నీరందడం లేదు. ఈసారి పంట సాగు నెల ఆలస్యమవుతోంది. నాకు ఎకరన్నర భూమి ఉంది. నార్లు పోసుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నాం. –రవి, యాకర్‌పెల్లి

కాలువలు శుభ్రం చేయించాలి



మధ్య కాలువ ద్వారా నీరు విడుదల చేసినా డిస్ట్రిబ్యూటరీల్లో పూడిక పేరుకుపోవడంతో చివరి భూములకు నీరందడం లేదు. ఉపకాల్వ ల్లోని పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించాలి. గతంలో మాదిరి నిరంతరం నీటిని అందించాలి. – నవీన్, బోరిగాం

వెంటనే ఉపకాల్వల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వేడుకుంటున్న రైతులు..

అధికారులు స్వర్ణ ప్రాజెక్టు నుంచి వాగుకు నీటిని విడుదల చేస్తున్నారని.. దీంతో మధ్య కాల్వ పరిధిలో ఉన్న మా భూములకు సాగునీరందడం లేదని మండలంలోని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఉపకాల్వల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించి నిరంతరం సాగునీటిని అందించాలని కోరుతున్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి


కుభీర్‌లో పూజలు చేస్తున్న గిరిజనులు


లక్ష్మణచాంద: బోరిగాంతండాలో..


నిర్మల్‌లో పూజలు చేస్తున్న వైద్యులు


తానూరు: మసల్గాతండాలో గిరిజనుల పూజలు


ముథోల్ మండలం చింతకుంటలో..

కుభీర్: మండల కేంద్రంతోపాటు వివిధ గిరిజన తండాల్లో గురువారం గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ 285వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. వారు సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, వసంత్ నాయక్, మాజీ సర్పంచ్‌లు గోపిచంద్, విజయ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాంతండా, పార్‌పెల్లితండా, వడ్యాల్‌తండా గ్రామాల్లో సేవాలాల్ మహరాజ్ విగ్రహం వద్ద గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భానుచందర్, ప్రేమ్‌దాస్, సురేశ్, గంగారాంనాయక్, గంగారాం, రాంచంద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గం ఆచరణీయమని పలువురు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. ఆస్పత్రి వైద్యులు నాశం స్వప్న, శశికాంత్, లంబాడా జేఏసీ జిల్లా అధ్యక్షుడు జాదవ్ అశోక్‌నాయక్, గిరిజన విద్యార్థి విభాగం అధ్యక్షుడు జాటోత్ గజేందర్, లంబాడా హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రోహిదాస్, రామకృష్ణ, రాంచందర్, కైలాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తానూరు: సంత్ సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలలని మాజీ సర్పంచ్ పుడలిక్ అన్నారు.గురువారం మండలంలోని మసల్గాతండా గ్రామంలో సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. వీధుల్లో సేవాలాల్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి యువకులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, శివాజీపటేల్, కార్యదర్శి విఠల్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి, విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ, ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు ఉన్నారు.

ముథోల్: మండలంలోని చింతకుంటతాండ, ఎడ్‌బిడ్‌తండా, విఠోలితండా, తరోడాతండాల్లో సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. సేవాలాల్ ఆలయంలో పూజలు చేసి భోగ్ బండార్ చేపట్టారు. మాజీ సర్పంచ్‌లు రాజేందర్, ధూమ్ నాయక్, విజేశ్, బంజారా నాయకులు ఉన్నారు.

అందుబాటులో ఉంటూ సేవ చేస్తా

- మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

లోకేశ్వరం: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో ఉపాధిహామీ పథకం నిధులతో డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం నగర్‌తండాలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణ్‌రావు పటేల్ మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క లోకేశ్వరం మండలానికి మంజూరు చేసిన ఉపాధి నిధులు రూ.కోటితో వివిధ గ్రామాల్లో సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. లోకేశ్వరం ఎస్సీ కమ్యూనిటీ భవనం కోసం రూ.రెండు లక్షలు, నగర్‌తండాలోని సేవాలాల్ మహరాజ్ మందిరం ప్రహరీ కోసం రూ.మూడు లక్షలను మంజూరు చేస్తామని వివరించారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ జట్టు అశోక్, కాంగ్రెస్ నాయకులు పండరి గౌడ్, రాంచందర్‌రావు, ముకుంద్‌రావు, భోజారాం, ఆనంద్‌రావు పటేల్, శంకర్ చౌహాన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి ముత్తగౌడ్, నరేశ్, శ్రీనివాస్, రాజారెడ్డి, ముత్తన్న ఉన్నారు. మండలంలోని పుస్పూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ సంగెం నర్సన్న గురువారం గ్రామంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నారాయణ్‌రావు పటేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేశారు.


లోకేశ్వరంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నారాయణ్‌రావు పటేల్

నిర్మాణ పనులు ప్రారంభం

ముథోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో గురువారం రూ.13.7లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పాటిల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లావణ్య రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు, అశోక్, మాజీ ఎంపీపీ భోజారాంపటేల్ తదితరులు ఉన్నారు.

నువ్వు సాగుపై రైతులకు అవగాహన


పంట పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో గురువారం నువ్వు పంట సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నువ్వు గింజల సాగును ప్రోత్సహించడంలో భాగంగా హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ భారతీయ నూనె గింజల పరిశోధన స్థానంతోపాటు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి ఆసం రవి తెలిపారు. జనవరిలో జేసీఎస్1020రకం నువ్వు విత్తనాలను షెడ్యూల్ తెగ ఉపప్రణాళిక పథకం ద్వారా షెడ్యూల్ తెగలకు చెందిన రైతులకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన నువ్వు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో భారతీయ నూనెగింజల పరిశోధన స్థానం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్, అఖిల్, వినేశ్ తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించండి


నర్సాపూర్(జి): నర్సరీలో ఎంపీడీవో పుష్పలత

సారంగాపూర్: నర్సరీల్లోని మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని ధని గ్రామంలో డీఎల్‌పీఓ పర్యటించారు. ఈసందర్భంగా వైకుంఠ ధామం, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పలు వివరాలు తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌యార్డుకు తరలించాలని పంచాయతీ కార్యదర్శి ఫీషాన్‌కు సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రాంపూర్‌లో ఎంపీడీవో పర్యటన..

నర్సాపూర్(జి): వేసవి సమీపిస్తున్నందున నర్సరీల్లో గ్రీన్‌షెడ్ నెట్లు ఏర్పాట్లు మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో పుష్పలత అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలను తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటానికి గల కారణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అనంత విశ్వేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్, ఎఫ్ఏ హైమద్ పాల్గొన్నారు.

భారత్‌బంద్ సన్నాహక ర్యాలీ


ఖానాపూర్ : ర్యాలీలో పాల్గొన్న నాయకులు


భైంసాలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పలు కమ్యూనిస్ట్ పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో సన్నాహక బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ర్యాలీ తీశారు. నందిరామయ్య, దుర్గం నూతన్ కుమార్, డాకూరి తిరుపతి, బొమ్మెన సురేశ్, తొడసం శంభు, చుంచుల నారాయణ, సునారికారి రాజేశ్, దుర్గం లింగన్న, తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న చేపట్టే గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో బైక్‌లతో బంద్ సన్నాహక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు దుర్గం నూతన్‌కుమార్, హరిత, మురళీమోహన్, మహేందర్ తదితరులున్నారు.

'చలో దేగాం'కు తరలిరావాలి

భైంసాటౌన్: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా ఈనెల 16న భైంసా మండలం దేగాంలో చేపట్టే రాస్తారోకోలో అన్నదాతలు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు పిలుపునిచ్చారు. మండలంలోని దేగాం, ఇలేగాం, వాలేగాం గ్రామాల్లో గురువారం బంద్‌కు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర చట్టం, రుణమాఫీ, రైతు కూలీలకు పెన్షన్, రైతు వ్యతిరేక చట్టాల రద్దు, రైతు ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతులపై కేసుల ఉపసంహరణ డిమాండ్ల సాధనకు రాస్తారోకో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏఐకేఎంఎస్, ఏఐకేఎస్ నాయకులు గంగాధర్, ముత్తన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేందర్ తదితరులు ఉన్నారు.

108లో ప్రసవం


శిశువును కుటుంబీకులకు అందిస్తున్న సిబ్బంది

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వతాండ గ్రామానికి చెందిన బూలాబాయి అనే గర్భిణికి గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారమిచ్చారు. దీంతో 108 వాహనంలో పైలెట్ నయీముల్లాఖాన్, ఈఎంటీ భోజన్న గ్రామానికి వచ్చి గర్భిణిని నిర్మల్ తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మార్గం మధ్యలో సిబ్బంది ప్రసవం చేయగా బూలాబాయి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు వెల్లడించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

'వేధింపులు మానుకోవాలి'

నిర్మల్‌టౌన్: కుభీర్ మండలంలోని పల్సి గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కత్తి సాగర్‌ను మాదిగ ఉద్యోగి అని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన చత్ర యువ సంఘర్ష సమితి సభ్యుడు నిర్మల్‌కు చెందిన అరవింద్ వేధిస్తూ రూ.ఐదు లక్షలు డిమాండ్ చేస్తున్నాడని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు. గతంలో కొందరు సాగర్ విద్యార్థినులను వేధిస్తున్నాడని డీఈవో, ఎంఈఓకు ఫిర్యాదు చేశారన్నారు. విచారణ జరిపిన అధికారులు సాగర్ తప్పు లేదని తేల్చారన్నారు. కానీ మళ్లీ ఇప్పుడు బాలల హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలిపారు. ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. టీఎంఆర్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామదాస్, జిల్లా ఇన్చార్జి సాయన్న, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ముథోల్ ఎంపీడీవో


రాములును సన్మానిస్తున్న సిబ్బంది

ముథోల్: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవోగా బి.రాములు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన ఎంపీడీవో సురేశ్‌బాబు బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లగా.. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి నుంచి బి.రాములు బదిలీపై ముథోల్ వచ్చారు. నూతన ఎంపీడీవోను ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, ఏపీవో శిరీష, ఎంపీవో అమీర్‌ఖాన్, కార్యదర్శులు సన్మానించారు.

ఈరోజు

టీఎన్జీవో ఉద్యోగుల నిరసన

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌చైన్‌గేట్ : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర శాఖ, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ సమాఖ్య పిలుపు మేరకు జిల్లాలోని ఉద్యోగులందరూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపనున్నట్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెల్మల ప్రభాకర్, కుడాల రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంపు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి పలు డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులందరూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష

నిర్మల్‌రూరల్: ఇంటర్ ఫస్ట్‌ఇయర్ విద్యార్థులకు శుక్రవారం ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఐఈఓ పరశురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న పర్యావరణ పరీక్ష నిర్వహిస్తామని.. ఇంటర్మీడియట్ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పరీక్షలకు హాజరు కాకుంటే వార్షిక పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించినా వారికి పాస్ మెమోలు నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయం గమనించి పరీక్షలకు హాజరవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆటోడ్రైవర్ల నిరసన

లక్ష్మణచాంద: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకంగా శుక్రవారం మండలవ్యాప్తంగా ఆటోడ్రైవర్లు నిరసన చేపట్టనున్నట్లు ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు రత్నయ్య తెలిపారు. గురువారం లక్ష్మణచాందలోని ఆటో స్టాండ్ వద్ద ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము నష్టపోతున్నామని.. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు నెలకు రూ.15వేలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో తమ ఇంటి వద్దే ఆటోలను ఉంచి నిరసన చేపడుతామని పేర్కొన్నారు.